క్లుప్తంగా

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, ఫలక్‌నామాలకు వెళ్లే ఎంఎంటీఎస్ రైళ్ల వివరాలు ఇలా..

నాంపల్లి వైపు వెళ్లేవి

ఉదయం: 6:40, 7:40, 8:10, 9:15, 10:15, 11:10 , 11:55
మధ్యాహ్నం: 12:50 , 13:20 , 14:25, 15:20
సాయంత్రం: 16:10, 17:55
రాత్రి: 18:55, 20:05, 21:25
సికింద్రాబాద్ వరకు..రాత్రి 22:50, 23:25

ఫలక్‌నామా వైపు..

- ఉదయం: 5:50, 6:30, 6:50, 8:25, 9:05, 9:31, 10:05, 11:20 , 11:40.
- మధ్యాహ్నం: 12:40, 13:25, 14:40, 14:55 , 15:10
- సాయంత్రం: 16:35, 17:10, 17:30, 18:00,18:35
- రాత్రి: 19:10,19:55, 21:00, 21.15, 21:45.

నేటి సంతల వివరాలు

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో...

వారాంతపు కూరగాయల సంత గంగారంలో బుధవారం, హుడా కాలనీలో గురువారం, ఆర్టీసీ కాలనీలో బుధవారం, మదీనాగూడ గ్రామంలో ఆదివారం, మైత్రినగర్ మంజీరా రోడ్డులో శనివారం, ఆల్విన్ కాలనీలో గురువారం, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో గురువారం, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద గురువారం, 5వ ఫేజ్ వద్ద బుధవారం సంత ఉంటుంది.

మాదాపూర్ డివిజన్ పరిధిలో....

మాతృశ్రీనగర్‌లో సోమవారం, గోకుల్ ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద ఆదివారం, 80 ఫీట్ల రోడ్డులో బుధవారం సంతలు జరుగుతాయి.

విద్యుత్ అధికారుల నంబర్లు

చందానగర్ ఏడీఈ శ్యాంరావు :8332872962
మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేందర్ :9440813167
ఫ్యూజ్ ఆఫ్ కాల్ 24/7 : 9490153510

మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నంబర్లు

మియాపూర్ ట్రాఫిక్ సీఐ సుమన్ : 9491039172
ఆర్ఐ సురేష్ : 9490617353
ఎస్ఐ రమేష్ : 9491039162
ఎస్ఐ సుభాష్ : 8712663542

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం పదిమందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్ట్‌లు చేశారు. అందులో ఒకరికి పాజిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేశారు.

ఢిల్లీలో బీఆర్ఎస్ భవన్ ప్రారంభం

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: దేశ రాజధాని ఢిల్లీలో బీఆర్ఎస్ భవన్ ప్రారంభించడంపై ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ గురువారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ భవన్ నిర్మాణంతో జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలు విస్తృతంగా చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ జాతీయ పార్టీగా ఏర్పడిన తర్వాత వసంతవిహార్‌లో నిర్మించిన నూతన భవనాన్ని భవనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి పుష్పక్ బస్సులు

మియాపూర్ : మియాపూర్ మెట్రో స్టేషన్ నుండి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంకు 24 గంటల పాటు బస్సులు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు 20నిమిషాల వ్యవధిలో నడుస్తున్నాయి. అలాగే రాత్రి 11.10నిమిషాల నుండి ఉదయం 6.10నిమిషాల వరకు 40 నిమిషాల చొప్పున అందుబాటులో ఉన్నాయి.మియాపూర్ మెట్రోస్టేషన్, జేఎన్‌టీయూ నుంచి విమానాశ్రయానికి రూ.300లు అలాగే శిల్పారామం, గచ్చిబౌలి నుంచి టికెట్ ధర రూ.250 ఉంటుంది. గూగుల్ పే, పేటీయం, ఫోన్ పే సదుపాయం కూడా ఉంది. ప్రయాణికులు నగదు రహిత సేవలను కూడా వినియోగించుకోవచ్చు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంటను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న గ్రేటర్ ఇన్‌ఫ్రా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్మిక యూనియన్ నాయకులు వరప్రసాద్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గ్రేటర్ ఇన్‌ఫ్రా ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ ఇన్‌ఫ్రా పేరుతో కొంతమంది అక్రమార్కులు ఎర్రకుంటను ఆక్రమించి విల్లాలు, నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేసి ఎర్రకుంటను కాపాడాలని కోరారు. కౌన్సిలర్‌లు గోపాలమ్మ, శ్రీకాంత్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విడివిడిగా ఇస్తున్నా..

కలిపేస్తున్నారు..

- అమలుకాని తడి, పొడి చెత్త విధానం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



తడి, పొడి చెత్తను కలిపి తీసుకెళ్తున్న ఆటో

మియాపూర్: చందానగర్ సర్కిల్–21 పరిధిలో తడి, పొడి చెత్త విధానం అమలు కావడం లేదు. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడం, చెత్తను తరలించే పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వం తడి పొడి చెత్తకు ఇంటింటికి చెత్త బుట్టల పంపిణీకి లక్షల రూపాయలు ఖర్చు చేశారు. నీలం, ఆకుపచ్చ రంగుల డబ్బాలను జీహెచ్ఎంసీ అధికారులు ఇంటింటికి అందించారు. కాగా కొన్ని ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తున్నా ఆటో వారు రెండింటిని కలిపి ఒకే వాహనంలో తరలిస్తున్నారు.

- చందానగర్ సర్కిల్–21 పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఐదేళ్ల క్రితం ప్రతి ఇంటికి నీలం, ఆకుపచ్చ రంగు డబ్బాలను (డస్ట్‌బిన్) అందజేశారు.అలాగే వేరు చేసిన తడి, పొడి చెత్తను తీసుకెళ్లేందుకు వీలుగా ఆటో ట్రాలీలను కూడా సమకూర్చింది. ఆటో ట్రాలీలో తడి,పొడి చెత్త కలవకుండా ఉండేందుకు మధ్యలో పార్టీషన్ (రెండు విభాగాలుగా విభజించారు.
- సర్కిల్ పరిధిలో చెత్త సేకరణకు గానూ జీహెచ్ఎంసీ 130 ఆటోలు ఉన్నాయి. అదే విధంగా 129 ప్రైవేటు వాహనాల్లో కూడా చెత్తను తరలిస్తున్నారు. జీహెచ్ఎంసీ అందించిన ఆటోలలో తడి, పొడి వేరు చేసే విధంగా పార్టీషన్ ఉంది. ప్రైవేటు వాహనాల్లో తడి, పొడి చెత్త వేరు చేసే విధంగా లేకపోవడంతో చెత్తను కలిపి తీసుకెళ్లాల్సి వస్తోంది.
- ప్రస్తుతం సర్కిల్ పరిధిలో చెత్తను వేరు చేసి తీసుకెళ్లిన సందర్భాలు లేవు. ఆటోలలో రెండు భాగాలుగా విభజించేందుకు ఏర్పాటు చేసిన ఆ పార్టీషన్ రేకును తొలగించేశారు. ఇక ప్రైవేటు ఆటోలో చెత్తను కలిపి తరలిస్తున్నారు.
- తడి, పొడి చెత్త వేరు చేసే విధానం కోసం గతంలో కాలనీల్లో స్వచ్ఛ దూతలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు కొన్ని ఇళ్లల్లో తడి, పొడి చెత్త వేరు చేసినా ఆటోలలో కలిపి తీసుకెళ్తున్నారు. దీంతో ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేరు చేయకుండా అందిస్తున్నారు. దీంతో ఈ విధానం అనుకున్న ఫలితాలనివ్వలేదు.

దిమ్మె త్వరగా నిర్మించండి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మె నిర్మిస్తున్నప్పటికి తాత్కాలికంగా ఇనుప స్టాండ్‌పై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచారు. అక్కడే కార్లు పార్కింగ్ చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. త్వరితగతిన నూతన దిమ్మెను పూర్తి చేసి, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

–హఫీజ్‌పేట్



రామకృష్ణనగర్‌లో ఇనుపస్టాండ్‌పై ట్రాన్స్‌ఫార్మర్

సమస్యలను పరిష్కరిస్తాం

సమన్వయ సమావేశంలో జోనల్ కమిషనర్ వెల్లడి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గచ్చిబౌలి: ఆయా విభాగాల అధికారుల సహకారంతో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య అన్నారు. గురువారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కొత్తగా వార్డు కార్యాలయాలను సిద్ధం చేయాలని ఉప కమిషనర్లను ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మాన్‌సూన్ బృందాలను సిద్ధం చేయాలని సంబంధిత విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. నాలా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను తొలగించాలని టీఎస్‌సీపీడీసీఎల్ అధికారులకు సూచించారు. మోడల్ కారిడార్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, థీమపార్క్‌లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం త్వరితగతిన పూర్తిస్తామన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ జాయింట్ కమిషనర్ మల్లారెడ్డి, ఉప కమిషనర్లు వెంకన్న, సుదాంష్, రమేష్, బాలయ్య, మాదాపూర్ ఏసీపీ రఘునందన్‌రావు, సీఐ సురేష్, ఎస్ఆర్‌డీపీ ఎస్ఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



వెబినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ సతరూప ఘోష్

పటాన్‌చెరు టౌన్: తృణ ధాన్యాలు పోషకాలతో నిండి ఉంటాయని, ఏ వయస్సు వారికైనా సులువుగా జీర్ణమవుతాయని, వాటి వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పశ్చిమ బెంగాల్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వవిద్యాలయ ఫుడ్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతరూప ఘోష్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎఫ్ఎస్ఏ) ఆధ్వర్యంలో 'తృణధాన్యాలు భవిష్యత్ ఆహారం' అంశంపై గురువారం నిర్వహించిన వెబినార్లో ఆమె ప్రధాన వక్తగా పాల్గొన్నారు. 2023 అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తృణధాన్యాలు అత్యధిక పోషక విలువలు కలిగి ఉన్నాయని, అధిక శక్తిని ఇస్తాయన్నారు. తృణధాన్యాలు శరీర కణజాలాన్ని పునరుత్తేజితం చేస్తాయని, మధుమేహ వ్యాధిని తగ్గిస్తాయని, పిత్తాశయ రాళ్లను నివారించడంతో సహాయపడతాయన్నారు. అంతేకాకుండా రొమ్ము కేన్సర్‌ను నిరోధిస్తాయని, బరువు తగ్గడానికి దోహదపడ్తాయన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫుడ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరీ, డాక్టర్ మౌమితా దేవ్, డాక్టర్ పరుల్ థాపర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఢిల్లీలో బీఆర్ఎస్ జాతీయ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ అజేయశక్తిగా అవతరించనుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు బలపరుస్తున్నారని తెలిపారు.

మేడే స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమిస్తాం

పటాన్‌చెరు టౌన్: మేడే స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్థానిక బస్టాండ్ వద్ద మేడే వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ దేశంలో కార్మికులకు ఏడు గంటల పని, ఐదు రోజుల పనిదినాల కోసం రాబోయే కాలంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, విష్ణు పాల్గొన్నారు.



రోడ్డుపై మురుగు సమస్యను పరిశీలిస్తున్న నాయకులు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

బీజేపీ గెలుపును ఆపలేరు

గచ్చిబౌలి: బీజేపీ పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. 28వ రోజు గురువారం ఇందిరానగర్, జీపీఆర్ఏ క్వార్టర్స్ ప్రాంతంలో గడపగడపకూ బీజేపీ పాదయాత్రలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ దశలవారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని కాలనీల్లో సమస్యలున్నాయని, పెద్దఎత్తున నిధులు తెచ్చామని చెప్పే బీఆర్ఎస్ నాయకులు ఈ సమస్యలెందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఎల్లేష్, అనిల్‌కుమార్‌యాదవ్, రమేష్, మఖన్‌సింగ్, విశాల్‌సింగ్, సుకుమార్, రవి, విశ్వనాథ్, సాయి, శివ భరత్ పాల్గొన్నారు

ఫ్రాన్స్‌లో భారత విద్యార్థులకు మంచి అవకాశాలు

సీఎఫ్ఐ ప్రతినిధి మిర్రిన్ రైఖాన్



ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తున్న సీఎఫ్ఐ ప్రతినిధి మిర్రిన్ రైఖాన్

రాయదుర్గం: భారతదేశ విద్యార్థులకు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు ఉన్నాయని క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా (సీఎఫ్ఐ) ప్రతినిధి మిర్రిన్‌రైఖాన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఉర్దూ విశ్వవిద్యాలయం, క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా సంయుక్తంగా 'ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్‌లోని విద్యార్థులకు ఫ్రాన్స్‌లో విస్తృతమైన అధ్యయన ఎంపికలను అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. విద్యావ్యవస్థ, ప్రవేశ అవసరాలు, అందుబాటులో ఉన్న కోర్సుల గురించి విలువైన సమాచారాన్ని విద్యార్థులకు అందించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ భారతదేశంలో విద్యావ్యవస్థను మార్చే లక్ష్యంతో దేశం కొత్త విద్యావిధానం -2020ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ పటాన్‌చెరు డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఆదిత్య



ఆదిత్యకు నియామకపత్రాన్ని అందజేస్తున్న నాగరాజు

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ బీజేపీ నూతన ఉపాధ్యక్షుడిగా ఆదిత్యను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నాగరాజుయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్న డివిజన్, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పటాన్‌చెరు డివిజన్లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

నూతన విద్యావిధానంలో నాణ్యమైన విద్య

సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్ రుమేష్‌చందర్

రాయదుర్గం: నూతన విద్యావిధానం ద్వారా భారత విద్యారంగంలో అనేక మార్పులు వస్తాయని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఢిల్లీ రిటైర్డ్ ప్రొఫెసర్ రుమేష్‌చందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో 'విద్యపై ఆర్థిక నిర్ణయాల ప్రభావం: కొత్త విద్యావిధానం–2020లో ప్రతిబింబాలు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడానికి, పోటీ జాబ్ మార్కెట్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి నూతన విద్యావిధానంలో తీసుకున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, విద్యావిభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ మోషా హిద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విని ప్రసంగించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల విద్యార్థులు, ఇతర విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఏబీవీపీ నిరసన



పరిపాలనా భవనం ముందు నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో విద్యార్థుల సమస్యల సాధనకు ఎందాకైనా పోరాడతామని హెచ్‌సీయూ ఏబీవీపీ అక్షయ్ అంగుల్వార్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, యూనిఫామ్ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ పద్ధతి అమలు చేయాలని, సీఓఈ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని, ఆన్‌గోయింగ్ సెమిస్టర్‌లో హాజరు సడలింపు ఇవ్వాలని.. తదితరాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మొత్తం 11 డిమాండ్లతో నిరసన చేపట్టామని ,అధికారులు స్పందించకపోతే భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి ఆకాశ్‌భాటి, మాజీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, ఏబీవీపీ నాయకులు తులసీరామ్, ఆయేషా, వికాస్ రితాంజలి, శ్రితికా, ప్రణికా, ప్రశాంత్, సాక్షి, ధరమ్‌వీర్, సురేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి



మియాపూర్ : చందానగర్‌లోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు, అపర్ణరోడ్డులో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. గత వారం రోజులుగా రోడ్డుపై మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాధుడే లేడని, ఫిర్యాదు చేసిన ప్రతిసారి సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

పార్ట్‌టైం జాబ్ ఉందంటూ మోసం

- సైబర్ వలలో చిక్కిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
- పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఉందంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ. 4.20 లక్షల, మరో ఉద్యోగి 1.30 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బీరంగూడకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 22వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. అది నమ్మిన ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ఇచ్చిన టాస్కులను పూర్తిచేశాడు. చివరికి తను పెట్టిన రూ. 4.20 లక్షలకు రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో తను మోసపోయినట్టుగా గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఉద్యోగి..

అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 26వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం ఉందంటూ మెసేజ్ వచ్చింది. తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్కులు చేస్తూ వచ్చాడు. చివరకు తను పెట్టిన 1.30 లక్షలకు రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరగా ఆ వ్యక్తులు స్పందించలేదు. దీంతో ఆ బాధితుడు మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చెట్ల కొమ్మల తొలగింపు



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా హైదర్‌నగర్ డివిజన్ జై భారత్ నగర్ కాలనీలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను గురువారం తొలగించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివారావు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను జీహెచ్‌యంసి, ఎలక్ట్రికల్, హార్టికల్చర్ అధికారుల సమన్వయంతో తొలగించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే మరమ్మత్తులు చేసి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ కాళీ, హార్టికల్చర్ సూపర్‌వైజర్ దాసు, రాంకీ సూపర్‌వైజర్ శశి, ఎస్ఎఫ్ఏ భరత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఓబీసీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడం ఆనందంగా ఉందని ..ఓబీసీలకు విజయం దక్కిందని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద మాట్లాడుతూ భారీ సంఖ్యలో ఓబీసీ పోస్టుల భర్తీకి హెచ్‌సీయూ అధికారులు, పాలకమండలి చర్యలు తీసుకోవడం బీసీ, ఓబీసీ సంఘాల సమష్టి విజయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన టర్కీ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని రిపబ్లిక్ ఆఫ్ టర్కీ రాయబార కార్యాలయ బృందం గురువారం సందర్శించింది. రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్, సదుల్లా ఉజున్, ఎర్కాన్ దిలావెరోగ్లు, జైనెప్ డెనిజ్ ఈగితోపాటు టర్కీ ప్రభుత్వ అధికారుల బృందం ఎస్పైర్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించారు. స్టార్టప్‌ల బృందంతో చర్చించారు. ఓర్హాన్ యల్మాన్ ఓకాన్ ఎస్పైర్ బృందానికి శక్తివంతమైన వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి రెండు దేశాల మధ్య ఉమ్మడి కార్యక్రమాలను ప్రారంభించే అవకాశాలను కూడా వివరించారు.



హెచ్‌సీయూలోని ఎస్పైర్ ఇంక్యుబేషన్ సెంటర్ వద్ద టర్కీ బృందం

ఇక్రిశాట్ కార్మికులకు అండగా ఉంటాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇక్రిశాట్‌లో పనిచేసే కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో ఇక్రిశాట్ గేట్ వద్ద కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్‌లో పని చేసే కార్మికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు.